# కుక్కుటోపాయము

వీరయ్యగారిల్లూ, సోమయ్యగారిల్లూ ప్రక్క ప్రక్కనే ఉంటాయి. వీరిద్దరిళ్ళకు మధ్యలో ఒక పిట్టగోడ మాత్రమే అడ్డుగా ఉంటుంది. ఇంటికి అటూ ఇటూ ఉండే కిటికీలలోంచి చూస్తే ప్రక్క ఇంట్లో ఏం జరుగుతుందో కనబడుతుంది. వీరయ్యగారిది సొంత ఇల్లు. ఈ మధ్యే రిటైరైన తర్వాత అని అభిరుచులకు అనుగుణంగా అందంగా కట్టించుకున్నారు. సోమయ్యగారిల్లూ అంతే అందంగా ఉంటుందిగానీ, ఆయన కట్టించుకున్న ఇల్లు అద్దెకు ఇచ్చేసి, పట్నంలో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్ళిపోయాడు. క్రొత్తగా ఆ ఇంట్లో ఎవరో ఈ మధ్యే వచ్చి చేరారు.

ఒకరోజు మధ్యాహ్నం వీరయ్యగారు భోజనం చేసి విశ్రాంతిగా పడకుర్చీలో పడుకుని, తాపీగా చుట్ట కాలుస్తూ, పేపరు చదువుకుంటున్నారు. ఇంతలో ప్రక్క ఇంట్లోంచి 'భో ! భో! భో ! భో !' అంటూ కోడిని పిలుస్తున్నట్లు శబ్దం వినిపించింది. ఇలా వినిపించటం అది మొదటి సారికాదు. వారం రోజులుగా అదే శబ్దం వినిపిస్తూంది. ఈ పక్కింట్లో కుర్రాడికి కోళ్ళు పెంచటం సరదా అనుకుంటూ ఆ విషయాన్ని పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు. ఆయన పేపర్లోంచి దృష్టి మళ్ళించి, అటూ ఇటూ చూశారు. ఇంతలో ఆ శబ్దం ఆగిపోయింది. ఓసారి ఇంట్లోకి తొంగి చూశాడు. అప్పుడే ఆయన కూతురు కోమలి వంటింట్లోకి వెళుతూ కనిపించింది. కోమలికి సుమారు 18 సంవత్సరాల వయసుంటుంది. ఇంటర్‌తో చదువాపేసి ఇంట్లోనే ఉంటోంది. మరలా ఆయన దృష్టిని పేపర్లో నిమగ్నం చేశారు. కాసేపటికి మరలా 'భో ! భో ! భో ! భో !' అంటూ శబ్దం వినిపించింది. మరలా పేపర్లోంచి దృష్టిని మరలించి ఈసారి కొంచెం శ్రద్ధగా పరికించాడు.

ఈ శబ్దం ఎప్పుడు వస్తుంది? అని. సరిగ్గా అదే సమయంలో కోమలి బట్టలు తీసుకుని, బాత్రూంకి వెళుతూ కన్పించింది. అతనికి అప్పటికి అర్థమయింది. సరిగ్గా కోమలిలోపలి గది కిటికీ దగ్గరకు వచ్చేసరికి ఈ కోడిని పిలుస్తున్న శబ్దం వినబడుతుంది. అదే సమయంలో కోమలి కోపం కాకుండా, చిరు మందహాసాలు కూడా ఆవైపు ప్రసరిస్తున్నాయి. 'ఈ సంగతేమిటో ఈ రోజే తేల్చిపారేయాలి' అనుకుంటూ అపుడే తన 'ప్లాన్'ను సిద్ధం చేశారు.

కాసేపటికి గుర్తుకు వచ్చింది. ప్రక్క ఇంట్లో సోమయ్యగారు అద్దెకు ఈ మధ్యే క్రొత్తగా వచ్చిచేరారని. తనకు తెలిసినంతవరకు వాళ్ళకు కోళ్ళు ఏమీ లేవు. అసలు వాళ్ళు వెజిటేరియన్స్. వాళ్ళకు కోళ్ళు పెంచాల్సిన అవసరం ఏమీలేదు. తను ఆ యింటివైపు ఎప్పుడు చూసినా కోళ్ళు కనబడలేదు. వెజిటేరియన్స్ ఇంట్లోంచి ఈ నాన్ వెజిటేరియన్ శబ్దాలు ఏమిటో ఆయనకు అర్థం కాలేదు. 'ఈ మిస్టరీ ఏంటో ఇప్పుడే విడగొట్టాలి' అనుకొంటూ పేపరు మడిచి ప్రక్కనపెట్టి నెమ్మదిగా వంగి నడుస్తూ ఇంతకు ముందు శబ్దం వచ్చినవైపు, కనబడకుండా పిట్టగోడ ప్రక్కనే పొంచి ఉన్నాడు.

మరలా 'భో ! భో ! భో ! భో !' అంటూ కోడిని పిలుస్తున్న శబ్దం వినబడింది ప్రక్కింటి కిటికీలోంచి. పొంచి ఉన్న వీరయ్య వెంటనే లేచి నిలబడి చూసేసరికి, ఎదురుగా కిటికీలోంచి ఓ యువకుడు 'భో ! భో ! భో ! భో !' అని కోడిని పిలుస్తున్నట్లుగా శబ్దం చేస్తూ కనిపించాడు. అంత సడన్‌గా వీరయ్యగారిని చూసేసరికి, శబ్దం ఆపేసి బిక్క ముఖం పెట్టాడు. వెంటనే వీరయ్యగారు తమ ఇంటి కిటికీలోకి చూసేసరికి, కోమలి వెనక్కు తిరిగి వెళుతూ కనిపించింది. వెంటనే ఆ యువకుణ్ణి బయటకు రమ్మని పిలిచారు. ఆ యువకుడు భయపడుతూ గోడ అవతలి భాగానికి వచ్చి నిలబడ్డాడు.

''ఏం బాబు! నీకు కోళ్ళంటే యిష్టంలా వుంది! కోళ్ళను పెంచుతున్నావా?''

''అబ్బే! లేదండీ!.... ఏమండీ?''

''అహా! కోళ్ళను పిలుస్తున్నట్లు అరుస్తుంటే - ఏమిటా విశేషమని అడిగేను... మరేం అనుకోకు... ఇంతకీ నువ్వేం చేస్తుంటావు?''

''నేనా అండీ... మరి... మరేమో... ఎం.ఎ. చేసి జాబ్‌కి ట్రై చేస్తున్నానండి.''

''ఓహో! పని లేని పనులన్నమాట... అరే అంత సిగ్గు పడిపోతున్నావేంటి... ఆడపిల్లలా! ''

''అబ్బే! అదికాదండీ !''

''మరింకేదండీ? ఎం.ఎ. చదివేసేనంటున్నావు. కోళ్ళను పెంచడం లేదంటున్నావు. కోడి అరుపులు అరుస్తున్నావు! సంగతడిగితే తప్పు చేసినట్లు తడబడిపోతున్నావు... అంటే... నీ అరుపులు వెనుక పనులలో ఏదో అంతరార్థం వుందన్నమాటేగా!''

''ఏదో ఊసుబోక అరుస్తే అంతరార్థాంతం చేసున్నారేంటండీ బాబు! నాయింట్లో నేనరుచుకోకూడదా? కోడిలా అరుస్తా - లేకపోతే పిల్లలా అరుస్తా! నాయిష్టం మీకెందుకండీ మధ్య!''

''ఎందుకండీ మధ్య అంటే... మొదలు - మధ్య - చివరా. అంతా నాకేనయ్యా! కోడిలా అరుస్తా లేకపోతే పిల్లిలా అరుస్తానన్నావు చూడు; అందుకే! దొంగ పిల్లిలా నువ్వు ప్రవర్తిస్తే మరి ఆడపిల్ల తండ్రిగా నేను జోక్యం కలిగించుకోక తప్పదు. నువ్వు నీయింట్లో కూర్చుని కోడిలా - పిల్లిలా - లేకపోతే కుక్కలా అరుచుకో, నాకేం పర్వాలేదు. కాని కిటికిలోంచి మాయింటి కిటికివైపు చూస్తూ కోడిలా అరుస్తే - కూరవండుకు తినవలసి వస్తుంది మరి. ఇంతకీ మీ పెద్దవాళ్ళు యింట్లో లేరా! ఓసారి పిలు'' అన్నారు వీరయ్యగారు.

దాంతో విషయం ముదిరిపోతున్నదని... ''ఏదో తెలియక చేసేను... తప్పయిందండీ... క్షమించండి... మరెప్పుడూ అలా చెయ్యను'' అంటూ నీళ్ళు నమిలేడా నిరుద్యోగి అందగాడు.

''ఇంతకీ మీవాళ్ళను పిలవనంటావు. పోనీ నేనే పిలుస్తా'' అని ఓ అడుగు ముందుకేసారు వీరయ్యగారు.

''మా అమ్మగారు, నాన్నగారు ఊరెళ్ళారండీ...''

''అదీ సంగతి. అలా దారికిరా! మొత్తానికి మంచివాడివే ఫర్వాలేదు. ఓసారి యిలా రా'' అంటూ పిలిచేరు.

చచ్చేంరా బాబు! ఖర్మకాలి ఈ ముసలాడికి దొరికిపోయా నీవేళ! ఇంకెంత గొడవచేస్తాడో - అనుకుంటూ మేడదిగి వీరయ్యగారి కాంపౌండులోకి వచ్చాడు.

''చూడు బాబు! మనస్సు మహా చెడ్డది. దానికి వయస్సు తోడైతే నిప్పుతొక్కిన కోతే మనిషి. అది నీతప్పు కాదు. ఆ వయస్సు తప్పు. నీ కోడరుపులు - ఏకోడి గురించో తెలుసుకోలేనంత అమాయకుడ్ని కాను. అందులోను పెండ్లీడు ఆడపిల్ల గలవాడ్ని. అందుకని - మా అమ్మాయి నీకంత నచ్చితే - పెండ్లి చేసుకోదలిస్తే - డైరెక్ట్‌గా పిలిచి మాట్లాడొచ్చుగా నా సమక్షంలో? కోడరుపులు - పిల్లరుపులు దేనికి?'' అంటూ డైరెక్టుగా సబ్జెక్టులోకి

వచ్చేసారు వీయ్యగారు. అంత Direct attack యిచ్చేసరికి ముచ్చమటలు పోసేయి ఆ అందగాడికి. అక్కడితో అయిందనిపించక మళ్ళీ మొదలెట్టేరు. ''నీ పేరేమిటన్నావు... ఏపైరతేనేంలే... చూడు బాబు ఏపని చేసినా శ్రద్ధ వుండాలోయ్... నవ్వు చూడబోతే కోడిని పిలవడానికే ప్రాక్టీస్ చేసినట్టున్నావు కాని ఆ పిలుపుని మరో మలుపు తిప్పలేకపోతున్నావు. అందుకే దొరికిపోయావు. దొంగ ఎప్పుడైనా దొరకక తప్పదనుకో! కానీ నీలా మరీ యింత తొందరగా పట్టుబడడు. తెలిసిందా! ఎందుకు చెబుతున్నానంటే - మనం తప్పుపని చేసినా నలుగురి దృష్టిలో అది ఒప్పులా కనిపించాలి. నలుగురి దృష్టిలో దోషిగా నిలబడే తప్పు చేయడం గొప్పతనం కాదు. ఇంద్రుడంతటి వాడుకూడ అహల్య పొందుకోసం కోడిపుంజు అవతారమే ఎత్తేడు. కోడిలా అరిచేడు. మిగతా విషయం అనవసరం అనుకో. అందుకని చేసేపని సవ్యంగా - Natural గా చెయ్యాలి. అదే నీవు ఓ రెండు కోళ్ళను తెచ్చి పెట్టుకుని, వాటిని పిలుస్తున్నట్లు అరుస్తే - ఎవ్వరూ అనుమానించరు. ఆపాటి తెలివి నీకు లేదనికాదు. అనుభవం లేదని - అలా నువ్వు చెయ్యలేవనే నా ఉద్దేశ్యం.'' అని క్లాసు తీసుకునేసరికి ''ఎందుకు పిలిచేనురా బాబు! ఆ పిల్లని!'' ఈ జన్మలో మరోసారి ముసలివాళ్ళున్న యింటి అమ్మాయిలకి ''లైను'' వేయకూడదు అన్నభావం అతని ముఖంలో స్పష్టంగా కనిపించింది.

తన క్లాసు వ్యర్థం కాలేదని తెలుసుకున్న వీరయ్యగారు సంతోషంతో యిలా అన్నారు! ''నీకింక ఈ అవస్థ వుండదులే. అసలు మరే అమ్మాయికోసం యికముందు కోడరపులు అరవక్కర్లేదు... నాల్గురోజులు ఓపికపట్టు... ఇక పో!'' అంటూ ముసి ముసి నవ్వులు నవ్వారు. దానిభావం అర్థంగాక అయోమయంలో పడ్డాడు అతగాడు. దాని భావమేమి తిరుమలేశ?

- - -